ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం, పెడన, చల్లపల్లి నియోజకవర్గాల్లో దీపావళి పండుగను ఆదివారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లా, పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చేందుకు ఉత్సాహం చూపారు. గృహాల ముందు మహిళలు ముగ్గులు వేసి ప్రమిదల్లో దీపాలు వెలిగించటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లక్ష్మీపూజలు నిర్వహించారు. నగరంలోని రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాలలో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. బాణాసంచా కొనుగోలుదారులతో దుకాణాలతో పాటు కళాశాల ప్రాంగణం కిక్కిరిసింది. మచిలీపట్నం నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు టపాసుల కొనుగోలుకు ఇక్కడకు రావటంతో రద్దీ ఏర్పడింది. పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను: దీపావళి పర్వదినాన్ని ఆదివారం ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. అందరూ టపాసులు కాల్చుతూ సందడి చేశారు. ఉదయాన్నే మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఒక్కరూ నూతన వస్త్రదారులై సంతోషంగా పండుగను జరుపుకున్నారు. పండగను పురస్కరించుకుని బాణాసంచా దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. సాయంత్రం దీపాల వెలుగులతో పాటు బాణాసంచా మోతలు సందడి చేశాయి.

ఘనంగా దీపావళి వేడుకలు

మోపిదేవి: మండలంలో దీపావళి వేడుకలు వీధివీధిలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ప్రతి ఇంటా ప్రమిదల దీపాలు వెలిగించి, బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. వీధుల వెంట టపాసులు మోత మారుమోగింది. సంస్కృతి, సంప్రదాయలు ప్రతిభించేలా భక్తులు తమ శక్తి మేరకు తయారు చేసుకున్న పిండివంటకాలు, పండ్లు, పువ్వులు దేవునిఎదుట పెట్టి, టెంకాయ కొట్టి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. కొత్త అల్లుళ్లు అత్తారింట్లో సందడి చేశారు. కుటుంబ సభ్యులంతా నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు. దైవం చెడు నుంచి మంచిని, చీకట్లను పారదోలే దీపం భక్తుల కష్టాలను పారదోలుతుందని విశ్వసించిన ప్రజలు దీపావళి వేడుకలు ఘనంగా ప్రశాంతంగా నిర్వహించారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.


నేషనల్ కాలేజీలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద రద్దీ


అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకల్లో వృద్ధులు

దీపం.. నమస్తుభ్యం..

నాగాయలంక: మండలంలో ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు సంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగాయి. దేవాలయాలు, గృహాలు దీపకాంతులతో, టాపాసుల వెలుగులతో మిరుమిట్లు గొలిపాయి. ప్రధానంగా గ్రామీణ మహిళలు శ్రీలక్ష్మి అమ్మవారికి దీపాలతో విశేష అలంకారులు ప్రత్యేక పూజలతో తరించారు. టెర్రకోట ప్రమిదలను సుందరంగా అలంకరించి పూల అనుసంధానంతో నూనె దీపాలు వెలిగించి భక్తిప్రపత్తులను చాటుకున్నారు. కాలుష్య రహిత గ్రీన్ టపాసులలో ఆధునికత సాంకేతికత జోడించడంతో బాణాసంచా వెలుగులు వినూత్న రంగులతో కాంతులు వెదజల్లాయి. స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీరామలింగేశ్వరుని మండపం ఎదుట, కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో, సాయిబాబా మందిరం, పోతురాజుస్వామి దేవాలయ ప్రాంగణాలను విద్యుత్ దీపాలు, నూనె ప్రమిదలతో అలంకరించి బాణాసంచా కాల్చారు.


నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం రామలింగేశ్వరుని మండపం వద్ద బాణాసంచా వెలుగులు


వెలుగులు విరజిమ్ముతున్న చిచ్చుబుడ్డి

ఇంటింటా దీపావళి వెలుగులు

కోడూరు: దీపావళి పర్వదినాన్ని ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య కనులపండువగా జరుపుకున్నారు. ఆదివారం లక్ష్మీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సమీప దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం ఇళ్ల ముంగిట్లో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, అందులో దీపాలు వెలిగించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒకరూ టపాసులు కాలుస్తూ సందడి చేశారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద కూడా ప్రజలు సందడి అధికంగా కనిపించింది. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

కార్నియాల దానం


శివరామ ప్రసాద్ (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు, ఎలక్ట్రికల్ మర్చంట్ పొన్నూరు శివరామ ప్రసాద్(70) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించారు. ఆయన కార్నియాలను సోమవారం విజయవాడ తాడిగడపలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేశారు. ఆయన భార్య పద్మావతి, కుమారుడు కిరణ్‌బాబు, కుమార్తె లక్ష్మి మృతుడి కార్నియాలతో మరో ఇద్దరికి చూపు ఇవ్వాలనే సంకల్పంతో స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకొచ్చారు. ఈమేరకు స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణలకు సమాచారం అందించారు. వీరి సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. తమ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 191 మంది కార్నియాలు సేకరించామని రఘుశేఖర్ చెప్పారు.

అనాథల పాఠశాలకు కూరగాయల వితరణ



మోపిదేవి: మోపిదేవికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు రావి సుధాకర్ రెడ్డి, సాధామని దంపతులు రూ.10 వేలు విలువ గల కూరగాయలను అనాథ పిల్లల అన్నదానం నిమిత్తం పాఠశాలకు ప్రత్యేక వాహనంలో సోమవారం పంపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని హిల్ ప్యారడైజ్ పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు వితరణగా ఈ కూరగాయలు అందజేశామని దాత రావి దంపతులు తెలిపారు. నూతక్కి శివబాబు, బాబీ, స్థానికులు పాల్గొన్నారు.

కాళికా అమ్మవారికి ప్రత్యేక పూజలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి శక్తి గుడిలో కాళికా అమ్మవారికి ఆదివారం అమావాస్య ఘడియల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీపావళి అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రతి ఏడాది దీపావళి అమావాస్య రోజున పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి పూలతో విశేష అలంకారాలు చేసి పూజలు చేశారు. నగరంలోనే కాక పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు బాబీ, ఐవోబీ శ్రీనివాస్ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌కు చెందిన దాత సూరత్తు పాండురంగారావు రూ.40 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను విద్యార్థిని మాకర్ల మాధురికి సోమవారం అందజేశారు. ఆదివెలమ సంఘం కార్యాలయంలో ఆ సంఘ ప్రతినిధి పిల్లారిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను మాధురికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరానికి చెందిన మాధురి ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. గత ఐదేళ్లుగా పేద విద్యార్థులకు పాండురంగారావు విద్యానిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే మాధురికి రెండేళ్లుగా ఆర్థిక సాయం అందిస్తూ ఈ ఏడాది ల్యాప్‌టాప్‌ను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆదివెలమ సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, విజయశంకర్ పాల్గొన్నారు.

చంద్ర కుటుంబానికి అండగా ఉంటాం

చల్లపల్లి: సీనియర్ జర్నలిస్ట్ క్లోపల్లి చంద్ర కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ తెలిపారు. గ్రామానికి చెందిన జర్నలిస్ట్ చంద్ర ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, సోమవారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి యూనియన్ తరఫున సహాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన భార్యకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం వచ్చేందుకు ప్రయత్నం చేయాలని నియోజకవర్గ జర్నలిస్టులు జనార్దన్‌ను కోరారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే బాబు, యూనియన్ విజయవాడ నగర అధ్యక్షుడు చావా రవి, సభ్యత్వ కమిటీ జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: కార్తిక మాసం సందర్భంగా మంగళవారం నుంచి ప్రతి రోజు రాత్రి 9 గంటలకు మచిలీపట్నం నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధర రూ. 675గా నిర్ణయించామన్నారు. పంచారామాలకు ప్రతి శని, ఆదివారాల రాత్రి బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. టికెట్ ధర రూ.1200లు నిర్ణయించామన్నారు. ఈ బస్సులకు టికెట్లను ఆన్‌లైన్‌లో, ఏటీబీ ఏజెంట్ల వద్ద, రిజర్వేషన్ కౌంటర్లలో పొందవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 82475 29433 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోడూరు: గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం నుంచి స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మండల అధికారి వై.పుష్పలత సోమవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని, ప్రతి రోజు విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు గ్రంథాలయంలో సంప్రదించాలని పుష్పలత కోరారు.

వైద్య ఖర్చులకు సాయం

అవనిగడ్డ: మండల పరిధిలోని దక్షిణచిరువోలు లంక గ్రామానికి చెందిన గోసాల బాలకోటేశ్వరరావుకు శ్రీరామావెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. నెల రోజుల క్రితం పక్షవాతం రావడంతో బాలకోటేశ్వరరావు ఇంటి దగ్గరే ఉంటూ వైద్యసేవలు పొందుతున్నారు. ఆయన ఇంటికి వెళ్లి శ్యాంకిశోర్ నగదు అందజేశారు. కార్యక్రమంలో బచ్చు శ్రీనివాసరావు, యండ్రపాటి బసవేశ్వరరావు, రాజులు, గోసాల సుధాకరరావు, దోనె నాగరాజు, సుధాకర్, నూతన్ పాల్గొన్నారు.

కార్తిక శోభకు ముస్తాబైన శివాలయాలు

పెడన: కార్తిక మాసం.. పరమేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. నెల రోజుల పాటు భక్తులు శివాలయాలను సందర్శించి శివునికి విశేష పూజలు, అభిషేకాలు చేయడంతో పాటు ఉపవాస దీక్షలు చేసి భక్తిని చాటుకుంటారు. మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభకానుంది. నెల రోజుల పాటు జరిగే ఈ మాసంలో ప్రధానమైన రోజులు కార్తిక సోమవారాలు. ఈ సోమవారాలు ప్రత్యేకంగా వేకువ జామునే భక్తులు సాన్నాలను ఆచరించి శివాలయాలకు చేరుకుని దీపారాధనలు చేసి భక్తితో శివుని ప్రార్థించి కోరికలను తీర్చాలని ప్రార్థిస్తారు. భక్తుల సందర్శానార్థం ఆయా ఆలయాలు కమిటీలు శివాలయాలను ముస్తాబు చేయడంతో పాటు క్యూలను ప్రత్యేకంగా భారీ కేడ్లు నిర్మించారు. పట్టణంలోని శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అన్నసమరాధన కమిటీ ఆధ్వర్యంలో కార్తిక మాసంలోని నాలుగు ఆదివారాల పాటు భారీ అన్నసమారాధనలను నిర్వహిస్తారు. ఈ నెల 29న శివాలయంలో స్వామి వారికి రాత్రి ఏడు గంటలకు స్వామి కల్యాణోత్సవం జరుగనుంది. బ్రహ్మపురంలోని చౌడేశ్వరి ఆలయం, శివాలయం, ఉరివిలోని సోమేశ్వర ఆలయం తదితర ఆలయాల్లో కార్తికమాసం సందర్భంగా స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు విశేష పూజలు నిర్వహిస్తారు.


పట్టణంలోని శ్రీగంగాపార్వతీసమేత ఆగస్త్యేశ్వరస్వామి ఆలయం

భక్తిశ్రద్ధలతో కోత పండుగ


తెలుగు చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

మచిలీపట్నంటౌన్: నగరంలోని తెలుగుచర్చిలో ఆదివారం కోత పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలు చేతి కొస్తున్న నేపథ్యంలో దేవుడు పంటలను సమృద్ధిగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కోత పండుగను ప్రతి ఏడాది నిర్వహించటం ఆనవాయితీ. నగరంలోని చర్చి ఆఫ్ సౌత్ ఇండియాకు సంబంధించిన ప్రొటెస్టెంట్ క్రైస్తవులు పరిశుద్ధ ఆంద్రేయ మహాదేవాలయంలో 127వ కోత పండుగను నిర్వహించారు. అలాగే నగరంలోని నోబుల్ కళాశాల సమీపంలోని నోబుల్ ప్యారిస్ చర్చిలో 37వ కోత పండుగను, సుకర్లాబాద్‌లోని ఆర్‌సీఎం చర్చిలో బైబిల్ మిషన్ సండే వేడుకను నిర్వహించారు. కోత పండుగ సందర్భంగా చర్చి ఆవరణలో పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దేవుడు చేసిన ఉపకారానికి ప్రతీకగా క్రైస్తవులు ఈ సందర్భంగా అర్పణలు సమర్పించారు. రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు వారి వార్షికాదాయంలో కానుకలు సమర్పించి దేవునికి కృతజ్ఞతలు తెలిపారు. స్టాల్స్‌లో ఉంచిన పలు వస్తువులను కొనుగోలు చేశారు. అలాగే లలితా ఆర్ట్స్ గ్యాలరీ ఏర్పాటు చేసిన చిత్రాల ప్రదర్శన, విక్రయ స్టాల్ పలువురిని ఆకర్షించింది. ఈ చిత్రాలను విక్రయించగా వచ్చిన మొత్తాన్ని చర్చికి ఇస్తున్నట్లు నిర్వాహకులు డిలాన్, వాలంటైన్లు తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఘనంగా స్వచ్ఛ చల్లపల్లి 9వ వార్షికోత్సవం

చల్లపల్లి: మనిషి సౌకర్యవంతంగా, విలాసవంతంగా జీవించేందుకు అవసరమైన ప్రతిది అందిస్తున్న ఈ ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణకు చెందిన ప్రముఖ ప్రకృతి కవి, ప్రజా గాయకుడు జైరాజ్ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం 9వ వార్షికోత్సవాన్ని సోమవారం ఉదయం స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ – డాక్టర్ తరిగోపుల పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన జైరాజ్ మాట్లాడుతూ ఈ ప్రకృతికి తానేమేమి చేయాలని భావించానో అవన్నీ చేస్తున్న గొప్ప వ్యక్తులను చల్లపల్లి గ్రామంలో చూసే అదృష్టం దక్కిందన్నారు. తొమ్మిదేళ్లుగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి స్వచ్ఛ కార్యకర్త గర్వకారణమైన స్థాయిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా జైరాజ్ ఆలపించిన ప్రకృతి గేయాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నానీ), పర్యావరణ వేత్త ఉదయ్ సింగ్ గౌతమ్, ప్రముఖులు ముప్పాళ్ల భార్గవశ్రీ, దాసరి రామ్మోహనరావు, పంచాయతీ ఈవో మాధవేంద్రరావు, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా వేడుకలను పురస్కరించుకుని గ్రామంలో పాదయాత్ర, మొక్కలు నాటే కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు.


చల్లపల్లిలో మొక్క నాటుతున్న ప్రజా కవి జైరాజ్

నేడు ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలు

పెడన: పట్టణంలోని మూడో సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం జరుగుతుందని, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు హాజరుకావాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి ప్రారంభిస్తారని, మూడో సచివాలయం పరిధిలోని 7, 8, 9, 10వ వార్డు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, అధికారులు సచివాలయంలో సైన్‌బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

- మండలంలోని చోడవరం గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమానికి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సోమవారం ఓ ప్రకటనలో పార్టీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు కోరారు. కార్యక్రమం అనంతరం సచివాలయంలో పార్టీ జెండా ఆవిష్కరణ, గడప గడపకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే దానిపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు.

నేడు కె.కొత్తపాలెంలో..

మోపిదేవి: మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలనే కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు గరిశపూడిలో పల్లెకుపోదాం

కృత్తివెన్ను: ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డే ఎందుకు కావాలి అనే అంశంపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కృత్తివెన్ను మండలం లోని గరిశపూడి సచివాలయం వద్ద పల్లెకుపోదాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మసీదు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

పెనమలూరు: రాష్ట్రంలోని ప్రతి ఒక్క సామాజిక వర్గానికి పెద్దన్నగా జగనన్న నిలుస్తున్నారని, ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కానూరు సనత్ నగర్–సిద్ధిక్ నగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న మక్కా మసీదు నిర్మాణ పనులకు రక్ష ఫౌండేషన్ తరపున రూ.50 వేలు చెక్కు సోమవారం అందించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తన తండ్రి వైఎస్సార్ ఆశయాలను పుణికిపుచ్చుకుని పాలన సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మసీదు పెద్దలు పడమట స్నిగ్ధను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఎంపీటీసీ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, నాయకులు వహాబ్, రియాజ్, రహీం, బాజానీ, హాజీజ్, రెహమాన్, బాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఎన్నిక

నాగాయలంక: యూటీఎఫ్ మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, కార్యదర్శులు బి.జి.గోపాలకృష్ణ, ఎల్.సుభాషిణి పాల్గొన్నారు. మండల శాఖ కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పద్యాల రఘురామయ్య, అధ్యక్షుడు తెనాలి శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శి బండ్రెడ్డి సాంబశివరావు, సహాధ్యక్షులుగా మండల నాంచారమ్మ, పీతా వీర వెంకటేశ్వరరావు, కోశాధికారి మద్ది మురళి, ఆడిటర్ కాట్రగడ్డ నాగేశ్వరరావు, ఆఫీస్ ఇన్‌చార్జిగా సబ్బినేని సురేష్‌బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రమాణం చేయించారు.


ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

విద్యాభ్యాసానికి ఐవీఎం ఆర్థికసాయం

చల్లపల్లి: దివంగత జర్నలిస్ట్ క్లోపల్లి చంద్ర పిల్లలు ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసేందుకు తనవంతు సహాయం అందిస్తానని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. జర్నలిస్ట్ చంద్ర ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, సోమవారం సాయంత్రం స్థానిక లైబ్రరీ రోడ్డులో అతని కుటుంబ సభ్యులను సురేష్ – రోజా దంపతులు పరామర్శించారు. బి.టెక్ ఫస్టియర్ చదువుతున్న చంద్ర కుమారుడు హేమంత్‌కు హాస్టల్ ఫీజుకు రూ.30వేలు, కుమార్తె హరిణికి ఇంటర్ సెకండియర్ కళాశాల ఫీజు రూ.10 వేలు అందజేశారు. తండ్రిని కోల్పోయినా మనోవేదన అధిగమించి రాబోయే విద్యా సంవత్సరాల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తే విద్యాభ్యాసానికి తమ సంస్థ తరపున ఆర్థిక సహాయం కొనసాగిస్తామని సూచించారు.

రాయపూడి సహాయం

ప్రముఖ న్యాయవాది రాయపూడి వేణుగోపాల్ తన వంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని చంద్ర కుటుంబానికి పంపించారు. గత ఆరు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేణుగోపాల్ చంద్ర కుటుంబం పట్ల సానుభూతితో తన మిత్రుడి ద్వారా నగదు అందజేశారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా

ఐసీఈయూ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) మచిలీపట్నం డివిజన్ 55వ మహాసభ వాల్‌పోస్టర్‌ను సంఘ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 9వ తేదీన బాపట్లలో ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఇన్సూరెన్స్ ఉద్యోగులు మహాసభలో పాల్గొంటారని ఆ సంఘ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ తెలిపారు.

సహకార బ్యాంకుల్లో సొమ్ముకు భద్రత



గుడివాడటౌన్(నందివాడ): పొదుపు సొమ్ముకు సహకార బ్యాంకులు భద్రత కల్పిస్తాయని జనార్దనపురం సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొండపల్లి లక్ష్మీ నాగేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నందివాడ మండలం జనార్దనపురం గ్రామంలో సహకార బ్యాంకుల పనితీరు, లాభాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రజలకు సహకార బ్యాంకుల ప్రాధాన్యతను జాతా ద్వారా వివరిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష యోజన బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని వినియోగించుకుంటూ గ్రామీణ ప్రజలు సహకార బ్యాంకుల్లో సొమ్ము భద్రపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సెక్రటరీ విరివాడ అంజిబాబు, బ్యాంక్ ఉద్యోగులు, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపి పలువురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ఐలూరు శివారు కనిగిరిలంకలో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై సోమవారం సాయంత్రం దాడి చేశామని ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.36,150 నగదు, రెండు కోడిపుంజులు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.